# జతి స్వరం

కీచు గొంతుతో ఎవరో పాడుతున్నారు. రోడ్డు వారగా నడుస్తున్నదల్లా ఎదురుగా ఏదో లారీ మీద పడబోతున్నట్లు ఒక్కక్షణం ఆగిపోయింది వసుంధర.

'రార.. వేణు - గోప - బాల...' మళ్ళీ వినిపించింది అదే కీచుగొంతు.

బ్లాక్‌ఔట్ అవుతోందా? మతి చలించడం కాదు - స్తబ్దం అయిపోయింది. అడుగు ముందుకు పడడం లేదు. నిలుచుండిపోయింది. ఆ గొంతు వినిపించడం లేదు.

కాని మనసులో యింకా ఆ 'స్వరజతి' తాలూకు ధ్వనులే బొంగరాలుగా తిరుగుతున్నాయి. కెరటాలుగా లేచి పై నుంచి కిందకు దూకుతున్నాయి.

మనసంతా అతలాకుతలం.

ఏం చేయటానికీ తోచదు. నడిరోడ్డుమీద నడవడం లేదు గనుక సరిపోయింది. లేకపోతే ఈసరికి యేదో వాహనం కొట్టిపడేసి పరలోక ప్రయాణం చేయించేదే. ఆ దారిన నడుస్తున్నవాళ్లు క్షణమో - అరక్షణమో వసుంధర వైపు చూసీ చూడనట్లుగా, గమనించీ గమనించనట్లుగా ఒక చూపు పడేసి ముందుకు సాగిపోతున్నారు.

పదినిమిషాలపాటు గాలికి తేలిపోతున్నట్లుగా అలాగే నిలిబడిపోయింది.

'ఏమండీ.. ఇక్కడే వుండిపోయారేం? రోడ్ క్రాస్ చేయాలా? జీబ్రాలైన్స్ యిక్కడలేవు. ఇంకో నాలుగు అడుగులు ముందుకు వేయండి' అని పరిచయస్థుడు వెంకటరామయ్య పలుకరించాడు.

ఆమె అప్పుడు లోకంలోకి వచ్చి చుట్టూ పరికించింది. వెంకటరామయ్య ఎదురుగా నిలబడి వున్నాడు. వసుంధరకు ముఖమంతా చెమట వానిటీ బాగ్‌లోంచి రుమాలు బయటకు తీసి తుడుచుకుంది. 'ఏమండీ, ఏమయింది?' అని అడుగుతున్నాడు వెంకటరామయ్య. 'మీరు కులాసాగా ఉన్నారా? మాట్లాడండి'.

ముఖంలో కాస్త కదలిక కనిపించింది.

'ఇంటికి వెళుతున్నాను. రోడ్ క్రాస్ చేయనక్కర్లేదు - ఎందుకోగాని, యిక్కడకు

తిన్నక తరువాత అడుగు ముందుకు పడకుండా వుంది'

వెంకటరామయ్య నిదానంగా అన్నాడు.

'కాస్త... కాఫీ... నీళ్లు... తాగితే మంచిదేమో.. అదుగో. ఆ పక్కనే చిన్నహోటలు వుంది. రెండు అడుగులు చేయగలరా? లేకపోతే - ఇక్కడే వుండండి. నేను తీసుకువస్తాను.'

'ఫర్వాలేదులెండి నడవగలను ఇప్పుడేం కాఫీ వద్దులెండి. అయిదు నిమిషాల్లో యింటికి చేరుకుంటానుగదా' అంది వసుంధర.

'మొహమాట పడకండి మిమ్మల్ని చూస్తుంటే ఓ యిరవై రోజుల నుంచి లంఖణాలు చేసిన మనిషిలా ఉన్నారు. ముందు కాఫీ చుక్కలు గొంతులో పడకపోతే మామూలు మనిషి కాలేరు. దయచేసి నా మాట వినండి..' దాదాపు బతిమాలుతున్నట్లుగా అన్నాడు.

వసుంధర అతనితోపాటు నాలుగు అడుగులు వేసి రెస్టారెంట్‌లో ప్రవేశించింది. కూర్చున్న తరువాత నిజంగానే స్థిమితం చిక్కినట్టు అయింది మనసుకు.

రెండు గుక్కలు నీళ్లు తాగింది. 'ఎక్కువ తాగకండి' అని వెంకటరామయ్య హెచ్చరించడంతో గ్లాసు కింద పెట్టేసింది.

మళ్లీ రుమాలుతో ముఖం, మెడ తుడుచుకుంది. పొగలు కక్కుతూ కాఫీ కప్పు సిద్ధం అయింది. 'తీసుకోండి' అన్నాడు వెంకటరామయ్య. చాలా రుచిగా అనిపించింది. నిజంగానే నీరసం, ఆందోళన తగ్గిపోయి మామూలు మనిషి కాగలిగింది.

'చాలా థాంక్స్, వెంకటరామయ్య గారూ!' అంది అతని వంక గౌరవంగా చూస్తూ.

'అమ్మయ్య... అయిదు నిమిషాలపాటు నిదానంగా కూర్చోండి. ఇంటిదాకా నేనూ వస్తానులెండి. మరేం భయంలేదు.'

వసుంధర నవ్వుకుంది. ఏమయింది తనకు? నయమే. రోడ్డుమీద పడిపోలేదు. మరేదో సీన్ క్రియేట్ చేయలేదు. నిజంగా వెంకటరామయ్య దేవుడే! కాఫీ తాగకపోతే తాను కోలుకునేదే కాదు.

ఇంటికి వచ్చి సోఫాలో సుఖాసీనురాలు అయిన తర్వాత. మళ్లీ అడిగాడు వెంకటరామయ్య 'ఏమండీ! ఏమయింది?' అని.

ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. తనకూ ఇతమిత్థంగా తెలియదు.

వెంకటరామయ్య జవాబుకోసం బలవంతం చేయలేదు.

'ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేదు. ప్రసాద్‌గారు ఇంటికి వచ్చే టైం అయింది కదూ!' అన్నాడు అతను. అతను అంటూ వుండగానే ప్రసాద్ లోపలకు అడుగులు వేస్తూ 'హలో! వెంకటరామయ్యా! ఏమిటి అకస్మాత్తుగా యిలా ఊడిపడ్డారు? ఎంతసేపయింది వచ్చి?' అని అడిగాడు.

తను చూసిందీ చేసిందీ క్లుప్తంగా చెప్పాడు వెంకటరామయ్య. వసుంధర కళ్లల్లో కృతజ్ఞత నింపుకుంటూ 'అన్నయ్యగారు ఆ క్షణంలో ఆదుకోనట్లయితే, నేనేమయ్యేదాన్నో?'

అంది.

ప్రసాద్ గాబరాపడిపోయాడు. 'అసలు ఏమయింది?' అని అడిగాడు. మళ్లీ మొదటికి వచ్చినట్లయింది వసుంధరకు. తనకే సిగ్గుగా వుంది. ఏమని చెప్పడం? ప్రసాద్ 'డాక్టర్ని పిలుస్తాను' అన్నాడు.

'వద్దు. వద్దు. ఇప్పుడు నాకేం అనీజీగా లేదు. తరువాత అవసరం అయితే చూద్దాంలెండి. మీరు కూర్చోండి. అన్నగారితో మాట్లాడుతూ వుండండి. మీ ఇద్దరికీ కాఫీ తెస్తాను'అని లేవబోయింది వసుంధర.

'ఒక్క అరగంట అయినా మీరు స్థిమితంగా కూర్చోవాలమ్మా' అన్నాడు వెంకటరామయ్య.

వసుంధర ముఖమంతా నవ్వు పులుముకుని 'ఇంకా నయం! ఆరునెల్లు అబ్సల్యూట్ బెడ్‌రెస్ట్ అవసరం అన్నారు. కాదు! డాక్టర్ అయితే యిమాటే అంటారు' అంటూ ఇంకేం తాత్సారం చేయకుండా సోఫాలోంచి లేచి లోపలకు వెళ్లింది.

ప్రసాద్ ఆమె వంటగదిలోకి వెళ్లడం గమనించి 'అమ్మయ్య ఫరవాలేదనుకుంటాను. అసలు ఆఫీసులో యేమన్నా ప్రాబ్లెమ్స్ ఉన్నాయో. యేమో! ఆలోచిస్తూ రోడ్డు వెంట నడవడం వసుంధరకు అలవాటే!' అన్నాడు వెంకటరామయ్యతో.

'కాని - రోడ్డుమీద ఆమె ముఖం చూసినప్పుడు మాత్రం నేను చాలా గాబరాపడిపోయాను. నిలబడే వుండగలిగారు గనుక ప్రమాదం జరగలేదు. అయినా.. రేపు మధ్యాహ్నం డాక్టర్ని చూడడం మంచిదనుకుంటాను. ఆఫీసుకు సెలవు పెట్టించండి. మీరూ వెళ్లకండి' ఇలా మరునాటి ప్రోగ్రాం దాదాపు ఫిక్స్ చేశాడు వెంకటరామయ్య.

'యాభయి యేళ్లు వయస్సు వచ్చాక ఈమాత్రం ముందుజాగ్రత్తలు తప్పనిసరే! అందుకేం సందేహం లేదు' అని భరోసా చెప్పుకున్నాడు ప్రసాద్.

వాళ్లిద్దరూ కాఫీ తాగుతూ వుండగా పెద్దబ్బాయి సురేష్ వచ్చాడు. కథంతా మళ్లీ మొదలు.

ప్రసాద్ కొడుకుతో చెబుతూ వుంటే అదంతా ఎవరికో జరిగినట్లుగా రికామీగా వింటూ కూర్చుంది వసుంధర. తరువాత, చిన్నబ్బాయికి, అమ్మాయికి చెబుతున్నప్పుడు యింకెన్ని చిలువలు పలువలు చేరుకుంటాయో! ఇంతకూ - యేమయింది తనకు?

మరునాడు చాలా బిజీ డే. డాక్టర్ దగ్గరకు వెళ్ళకుండా వుండటానికి వసుంధర చెప్పిన మాటలన్నీ వృథా అయినాయి. ప్రసాద్, పిల్లలు ససేమిరా అన్నారు.

బి.పి.లేదు. ఎక్కువగాని - తక్కువగాని రక్తంలో చక్కెర లేదు. యూరిన్‌లో అసలు ఆ ఛాయలే లేవు. ఇ.సి.జి.లో గుండెకు యేమీ 'తకరారు' లేదని బహు స్పష్టంగా తెలిసిపోయింది. బ్రెయిన్ స్కాన్ చేశారు. ఎక్కడా రక్తం గడ్డకట్టుకుపోలేదు. నరాల ప్రయాణాలలో వంకరటింకరలు లేవు.

ఈ ఫలితాలన్నీ వచ్చేసరికి పదిరోజులయింది. చివరకు ఫిజిషియన్ 'అంతా చక్కగా వుంది. శారీరకంగా ఎలాంటి కంప్లెయింటూ లేదు. మరి యిలా ఎందుకు అయిందంటారు?' అని ఒక్క నిమిషం ఆగి ధైర్యం కోసం మాత్రలు, టానిక్ రాసిస్తాను. వేళ తప్పకుండా తీసుకోండి. సైవారం నుంచి ఆఫీసుకు వెడుదురు గాని' అన్నాడు.

'నిష్కారణంగా మిమ్మల్నందరినీ పదిహేను రోజులపాటు నానా హైరానా పెట్టాను. ఇకనైనా యేమీ లేదని నన్ను మామూలుగా వదిలేస్తారా, లేదా?' అని వసుంధర భర్తను, పిల్లల్ని దండించాల్సి వచ్చింది.

'ఆరోజు మీ ముఖం చూసిన వాడిని నేనున్నాను. ఇదంతా యేమీ లేదు అంటే నాకు నమ్మశక్యం కాదు. మీరు యేమయినా అనండి' అన్నాడు వెంకటరామయ్య.

'ఆ మాట వారితోను, పిల్లలతోను అనకండి. అనవసరంగా ఖంగారుపడతారు' అంది వసుంధర బతిమాలుతున్నట్లుగా.

వెంకటరామయ్యను నిశ్శబ్దపరచడం తేలికే అయిందిగాని, వసుంధర మనసు మాత్రం నిదానంగా వుండిపోయిందనుకోవడానికి వీలులేదు. ఎందుకు ఇలా అయింది తనకు?' అనేది పెద్ద ప్రశ్న.

ఆరోజు జరిగిన ఈవెంట్స్ గుర్తుకు తెచ్చుకుంది. ఒకమారు పదిసార్లు కాదు వెయ్యిసార్లు. రోజులాగే ఆఫీసుకు వెళ్ళి కూర్చుంది. మామూలు వాతావరణమే. కాగితాలే, ముఖాలే. కొత్త మనుషులుగానీ, సందర్భంగానీ యేమీ ఒనగూడలేదు. అతి సాధారణంగా, సాదాసీదాగా గడిచిపోయే అనేకరోజులలో అదీ ఒకటి అయివుండేది - రోడ్డుమీద తాను స్తబ్దుగా నిలబడి వుండకపోతే.

ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లే దారి మామూలుదే. కొత్త దారియేమీ తొక్కలేదు. ఇంటికి వెడుతున్నప్పుడు కూడా మనసులో యేమీ ప్రత్యేకించి ఆలోచనలు లేవు. మనసు దాదాపు ఖాళీగానే వుంది. అడుగులు వేస్తూ నడుస్తోంది. చుట్టూ జరుగుతూ వున్నది. గమనించే అలవాటు యేనాడూ లేదు.

×××

పదిహేను రోజులు ఆఫీసుకు గైర్హాజరు తర్వాత ఈరోజే మళ్లీ నడుస్తోంది. సెలవు నుంచి తిరిగి వచ్చింది గనుక పరిచయం అయిన వాళ్ళందరూ ఒక్కొక్కళ్లే వాళ్ల అవకాశం చూసుకుని వచ్చి పలకరించారు. వాళ్లలో చాలామంది యింటికి వచ్చి పరామర్శించి వెళ్ళినవాళ్లే.

'ఈ రోజుకు ఎక్కువ పనిపెట్టుకోకండి. విశ్రాంతిగా కూర్చోవడం అలవాటు చేసుకోండి' అని పై ఆఫీసరు కూడా సూచనగా చెప్పాడు.

ఇంటికి బయలుదేరినప్పుడు అటెండర్ 'ఆటో తీసుకురమ్మంటారా. మేడమ్ అనడిగాడు. వసుంధర నవ్వుతూనే వద్దని సమాధానం చెప్పింది. అంత తక్కువ దూరానికి

అటోలు రావు. వచ్చిన యిరవై, ముప్పయి అడుగుతారు దండగ.

పెద్దబ్బాయి ఫోన్ చేశాడు మధ్యాహ్నం. 'నేను వచ్చేంతవరకూ ఆఫీస్‌లోనే వుండమ్మా అయిదున్నరకు టంచన్‌గా వచ్చేస్తాను' అన్నాడు.

'అనవసరం' అని డిస్కరేజ్ చేసింది వసుంధర. అయినా వాడు వచ్చేస్తాడని అయిదు గంటలు అయీ అవకుండానే బయలుదేరింది. ఇంటికి వెళ్ళిపోయి వాడు వచ్చేసరికి కాఫీ కూడా తయారుచేసి వుంచితే అమ్మంటే యేమిటో పిల్లలకు తెలిసివస్తుంది.

వసుంధర ఉన్నట్టుండి ఓ యింటిముందు ఆగిపోయింది. ఆరోజు తనకు మనసు స్తబ్దం అయింది సరిగ్గా యీ ఇంటిముందే.

రార.. వేణు..గోప.. బాల.. రాజిత.. సద్గుణ... జయశీల...

ఆపాట యిప్పుడు వినబడడం లేదుగాని, గాలిలో ఆ తరంగాలు యింకా తిరుగాడుతున్నట్లే వున్నాయి.

ఆపాట.. ఆపాటే.. తనకు సల్లమందులా పనిచేసిందని ఒక్క క్షణంలో గుర్తుకు వచ్చింది.

వసుంధర ఆ యింటివయిపు తేరిపార చూసింది.

రెండంతస్తుల ఇల్లు. మేడమీద బాల్కనీలో ఒకామె నిలబడి వుంది. కిందకు చూస్తూ. ఒక్క తృటిలో యిద్దరి చూపులూ కలిశాయి. ఆమె నవ్వింది. వసుంధర తన చుట్టూ కలయచూసింది. ఎవరూ లేరు. తనకోసమే ఆ నవ్వు. ఎగతాళిగా కాదు పరిచయ పురస్సరంగానే.

'అలా నిలబడిపోయారేం? పైకి రండి' అంది ఆమె చేతులూపుతూ.

వసుంధరకు ఆమెను చూచిన గుర్తులేదు. ఎందుకు యిలా పరిచయస్థురాలుగా పిలుస్తోంది? ఏమిటో కనుక్కుందాం - అన్నట్లుగానే వసుంధర పైకి వెళ్ళింది.

'రండి., మీ పేరు నాకు తెలీదుగాని.. దాదాపు రోజూ చూస్తూనే వున్నాను' అంది ఆమె.

'నా పేరు వసుంధర. మనం ఇదివరకు ఎప్పుడూ కలుసుకోలేదనుకుంటా'.

ఆమె వసుంధర చేయి అందిపుచ్చుకుని హాల్లోకి తీసుకెళ్ళింది కూర్చోబెట్టింది. నా పేరు కనకలత. మీరు మా యింటి ముందునుంచే ఆఫీసుకు వెడుతూ వుండడం. యింటికి తిరిగి వెళ్ళడం ప్రతిరోజూ చూస్తూ వుంటాను. మీరు నాకు బాగా గుర్తే. తల వంచుకు వెళ్ళిపోతూ వుంటారు. అంచేత నన్ను చూసి వుండరు. నాలుగయిదు రోజులుగా మీరు ఆఫీసుకు వెడుతున్నట్లు లేదు అవునా?'

ఇదంతా దేనికి దారితీస్తుందో తెలియక వసుంధర కాస్త చికాకు పడింది మనసులోనే. 'నాలుగయిదు రోజులేం కర్మ. పదిహేను రోజులయింది నేను యిటువచ్చి.. చెప్పండి. ఎందుకు పిలిచారు?' అంది.

'అవునా? నేను ఊరు నుంచి తిరిగి వచ్చి నాలుగు రోజులే అయిందిలెండి. పొద్దున్న పనిలో వుండి మీరు వెళ్లే సమయానికి బాల్కనీలో నిలుచో లేకపోయాను. సాయంత్రం మిమ్మల్ని మిస్ కాకూడదని పంతంపట్టి నిల్చున్నాను యిప్పుడు.. ఇవాళ నా యాభయ్యో పుట్టినరోజు. తెలిసినవాళ్లు యాభయి మందికి తాంబూలాలు యిచ్చుకోవాలనుకున్నాను' అంటూ ఆమె వెండిపళ్లెంలో తాంబూలం, కొబ్బరి బోండాం, రవిక, రెండు తినుబండారాల పాకెట్లు తెచ్చి ఇచ్చింది. కుంకం పెట్టి నమస్కరించింది.

'మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే' అని ఆ తరువాత తెలుగులో 'పసుపు కుంకుమలతో కలకాలం వర్ధిల్లండి. మీ ఆదరానికి థాంక్స్' అంది వసుంధర.

ఇలాంటి సందర్భాలలో తెలిసినవాళ్లు, తెలియనివాళ్లు అనే వ్యత్యాసం ఆడవాళ్లకు బొత్తిగా వుండదని వసుంధరకు తెలుసును.

ఆమె కాఫీ కూడా యిచ్చింది. అప్పుడు రెండు ముక్కలు మాట్లాడే అవకాశం దొరికింది వసుంధరకు.

'మీ యింట్లో సంగీతం సాధన చేస్తున్న పిల్లలు వున్నారా?' అని అడిగింది. ఆ గీతం వినిపించింది యీ ఇంట్లో నుంచేనా. కాదా అన్న విషయం నిర్ధారణ చేసుకోవాలని.

'మా యింట్లో పిల్లలు లేరండి. ఏం, అట్లా అడిగారు?'

'పదిహేను రోజుల క్రితం మీ యింట్లోంచి విన్నాను - ఎవరో సాధనం చేసుకోవడం...' వసుంధర యింకా వాక్యం పూర్తిచేయకుండానే కనకలత అందుకుంది.

'అవును.. సుమండీ.. మరిచేపోయాను. అబ్బే అదే సంగీతం కాదండీ. ఇంకా సరల స్వరాలు అంతే. మా పెద్ద ఆడబడుచు మనుమరాలు - పదేళ్లది - శృతి హార్మోనియం మోగించుకుంటూ సాయంత్రం ప్రాక్టీస్ చేస్తూ వుండేది. ఎప్పుడూ ఒకటే పాట.. అది వున్న వారంరోజులూ ఆ పాటతో చెవులు గళ్లుపడిపోయాయంటే నమ్మండి'అంటూ నవ్వేసింది.

వసుంధరకు సమాధానం సొంతం దొరకనే లేదు.

'ఏం సాధన చేసేది?'

'రార వేణు గోప బాలా.. ఇదే తెగ సాధనం చేసేది..' అంటూ కనకలత యింకా నవ్వసాగింది.

'ఎందుకూ నవ్వుతారు?' వసుంధర అర్థంకాక అడిగింది. ఈ మనిషి మతిస్థిమితం వున్నదేనా అని అనుమానం వచ్చిన మాట నిజమే.

'ఎందుకా? ఎందుకంటే యేం చెప్పమంటారు? నిజం చెప్పేయనా?' అంది కనకలత యింకా నవ్వుతూనే.

'ఆ అమ్మాయికి శృతి కలిసేది కాదా?'

'శృతో గతో నాకయితే తెలియదు. ఆ పాట అసలు చిన్నపిల్లలకు ఎందుకు నేర్పుతారో

నాకింత వరకూ అర్థంకాదు'.

గీతాలు, స్వరజతులు సంగీత సాధనంతో ప్రాథమిక అభ్యాసాలనీ, అవి బాగా పట్టుబడితే తప్ప ముందు ముందు వర్ణాలు, కీర్తనలు స్వాధీనం కావనీ ఆమెకు తెలియదు కాబోలు.. అనుకుంది.

కనకలత యింకా నవ్వుతూనే యిలా వివరించింది.

'పట్టుమని పదేళ్లయినా వుండని పిల్ల పోర్మణీ ముందు కూర్చుని - సారసాక్ష - నేరమేమి ... మరు బాధ కోర్వజాల...' అని సాగదీసుకుంటూ పాడడం ఎబ్బెట్టుగా వుండదుటండీ!'

సందర్భాన్నంతా కనకలత కొత్తకోణంలోంచి చూస్తున్నట్లు అనిపించింది వసుంధరకు.

ఆమె ఇంకా ఇలా అంది.

'అంతటితో ఆగదు ఆ గీతం.. మగువను ఈ లలననూ.. ఈ సొగసును.. చేకోరా.. కోరికలిం పొందా.. అంటూ యింకేమేమో వుంటుంది. పసిపిల్లలకు అర్థం తెలియదు గనుక సరిపోయింది!

వసుంధర కూడా ఆమెతో నవ్వు జత కలిపింది. యీ మాటలకు నయమే. ఇప్పటికయినా ఈమె అభిప్రాయం అర్థం అయింది. లేకపోతే తన 'అరసికత'కు కనకలత యింకెంత నవ్వుకునేదో.

'ఇప్పుడు ఒక రకంగా పరిచయం అయింది గనుక. అప్పుడప్పుడూ పలకరిస్తూ వుండండి. ఇంట్లో పగటిపూట ఎవరూ ఉండరు. పలకరింతల కోసం కలువరించిపోతూ వుంటాను - ఆఫీసు వదిలేదాకా...' అంది కనకలత.

వసుంధర మళ్లీ రోడ్డు మీదకు వచ్చింది.

విచిత్రం! ఆ పాట! ఆ కీచుగొంతు వినడం వల్ల తనకు మతిస్థిమితం తప్పిపోయినట్లు అయిందని గుర్తు తెలియడానికి పదిహేను రోజులు పట్టింది!

తనకేం సంగీతంతో ప్రత్యక్ష సంబంధం లేదే! కనీసం, సాహిత్యం గురించి కనకలత లాగా శ్లీలం, అశ్లీలం వెదికే మనసు లేదే!

వసుంధర మామూలు మనుషుల్లో పడుతున్నానని అనుకుంటూంది గాని ఆలోచించినకొద్దీ మనసు మరింత బిగిసిపోతున్నట్లు అవుతోంది.

ఆరోజు నాకు ఎందుకు అలా అయింది? అని ప్రశ్న వేసుకుని తెలియని సమాధానం కోసం తెగ వెదకడంలో మునిగి పోయింది. ఎందుకు? అనే ప్రశ్న మనిషిని తాపీగా రికామీగా వుండనివ్వదు. అయినా ఎందుకు యీ అర్థంలేని ప్రయాస! ఇప్పుడు కులాసాగానే వున్నాను. శారీరకంగా యేం ఇబ్బంది లేదని డాక్టర్లు నమ్మబలికారు. మానసికంగా ఎందుకు వ్యథ?

చెప్పుకోవడం తేలికేగాని మనసులోనుంచి యీ సందర్భాన్ని పెరికివేయడం కష్టం అయిపోతోంది.

రార వేణు గోప బాల.. అన్న సంగీత వాక్యం విన్నప్పుడు, మనస్సు స్తబ్దం అయిపోయిందని యింట్లో చెప్పలేదు. చెబితే యింకా ఎంత వేళాకోళం చేసేవాళ్లో గదా ఆయనా, పిల్లలూను.

వసుంధరను యీ ప్రశ్న బుర్ర తినివేయడం మొదలయింది. పైకి యేమీ అనడానికి లేదు. లోపల.. యే పని చేసుకుంటున్నా, యే పనీ లేకుండా విశ్రాంతిగా కూర్చున్నా మనసులో మటుకు ఈ ప్రశ్నే తొలచివేస్తున్నట్లు అవుతోంది. ఎందుకు? ఎందుకు?

ప్రసాద్ అడుగుతున్నాడు - 'నీకు ఈ మధ్య పరధ్యానం ఎక్కువయిపోతోంది. ఏమిటి యిలా తయారవుతున్నావు? డాక్టర్ చెప్పినట్లు అబ్సల్యూట్ రెస్ట్ తీసుకుంటే మంచిదేమో కదూ! రెండు మూడు నెలలపాటు...'

మహేష్ మరో ప్రతిపాదన తెచ్చాడు.

'అమ్మకు ఛేంజ్ కావాలనుకుంటాను. ఓ నెలరోజుల పాటు మీరిద్దరూ యేదయినా ఊరు వెళ్లి కులాసాగా గడిపిరండి.'

ప్రసాద్‌కు యీ సూచన నచ్చింది. తనకూ ఆఫీసులో మరీ టెన్షన్ అవుతోంది. వసుంధర మటుకు'యిటువంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు చేసి ఉన్న మతి కూడా పోగొట్టుకోకండి' అని పిల్లలకూ, ఆయనకూ మందలింపుగా చెప్పింది.

'అన్నయ్యకు పెళ్లి అయి, అమ్మకు అత్తగారి హోదా వస్తేగాని, మతి స్థిమితంగా వుండదు' అంది అర్చన.

'నీ పెళ్ళి కాకుండానేనా?' అన్నాడు సురేష్.

ఎక్కడో పుస్తకంలో చదివిన మాటలు గుర్తుకు వచ్చాయి వసుంధరకు. 'నిశ్చల జలనిధిలో ఎవరో గులకరాయి వేస్తారు. నీళ్ల ఉంగరాలు తిరుగుతాయి. మళ్లీ కోలుకోవటానికి సంవత్సరాలూ, జన్మలూ అవసరం కావచ్చును.'

వసుంధరకు ఒక ఉపాయం తట్టింది.

ఈ విషయాన్ని గురించి వారితోను, వీరితోను చర్చించి మరింత నవ్వులపాలు కావడంకంటె సైకియాట్రిస్ట్‌ను కలుసుకుంటే.. అదే మెరుగు!

ప్రసాద్‌కు కూడా తెలియకుండా ఎపాయింట్‌మెంట్ తీసుకుంది. మూడు సిట్టింగ్‌ల తర్వాత సైకియాట్రిస్ట్ ఇచ్చిన సలహా; మీరు బాగా మనసు లోపలి పొరల్లోకి వెళ్లి చూడండి. ఆ పాటతో మీకేమయినా సంబంధం వుంటే బయటపడుతుంది. మీ వల్ల కాకపోతే హిప్నటైజ్ చేసి కనిపెడతాను.'

వసుంధర తరువాతి మాటలు పట్టించుకోకుండా అవతలపడింది.

×××

వసుంధర ఆరోజు రాత్రి అతి సునాయాసంగా నిద్రపోయింది.

నిద్రలోనే నడిచి వెడుతోంది.

వసుంధర.. ముగ్గురు పిల్లలు.. భర్త.. హేపీ ఫ్యామిలీ.

వెనక్కు నడుస్తోంది.

ఇంకా పెళ్లి కాలేదు.

సవతి తల్లి పెడుతున్న ఆరడులతో సతమతం అవుతోంది.

అప్పటికింకా ప్రసాద్ జత కూడలేదు.

రెండో పెళ్లి చేసుకున్నందుకు పరితాప పడుతున్న తండ్రి రూపం.

ముగ్గురు అక్కలు. వాళ్ల మధ్య మరో నడివయసు స్త్రీ.

అమ్మ?

కొడుకు కావాలని ఉబలాటం ఆమెకు.

వరసగా ముగ్గురూ ఆడపిల్లలే అవడంతో వసుంధర కడుపులో వున్నప్పుడు 'మగబిడ్డడే' పుడతాడని ఎంతో ఆశపడింది.

వసుంధరను మగపిల్లాడి లాగానే పెంచమని భర్త చెప్పినా, నీరసంగా నిస్పృహగా నవ్విందే తప్ప ఊరట పొందలేదు అమ్మ.

'మీరు ఆపరేషన్ చేయించుకోకండి. నేనూ అందుకు సిద్ధంకాను. మనకు మగబిడ్డడు తప్పకుండా కావాలి' అంది అమ్మ.

మరీ నిరాశ ముంచెత్తి నేలమీద కూలబడిపోయి సన్నటి గొంతుతో రార - వేణు - గోప- బాల.. గీతం పాడుతూ వుంది.

కళ్లలో నీళ్లు.

గొంతులో జీర.

అదే పాట.

అమ్మ గొంతు నుంచి కీచుగా వస్తోంది.

పాటంతా పాడి అమ్మ కళ్లు ఒత్తుకుంటోంది.

ఉయ్యాలలో వున్న నెలల పిల్ల వంక క్షణం ఆప్యాయంగా, క్షణం అసహనంగా చూస్తోంది.

పసిపిల్ల యేడుపు మొదలెట్టింది.

'పలుమారు.. గారవముగ.. నినే..

పిలచిన పలుకవు.. అలుగకుర..' అంటూంది అమ్మ గొంతు. పసిపిల్లను ఒడిలోకి తీసుకుంటోంది.

రార-వేణు-గోప-బాల.. అదే గీతం అమ్మ గొంతులో - కీచుగా.

నెలల పిల్ల వసుంధర రెప్పలు ఆర్పకుండా అమ్మ పాట వింటోంది. ఆత్రంగా తల్లి వడిలో చేరి పాలు తాగుతోంది.

దుర్భరమైన రోగంతో తీసుకుంటూ కూడా - తల్లి ఆ పాట పాడడం ఆపుచేయలేదు.

గీతం ఆలపిస్తూ - కీచుగా - తనను వడిలో పెట్టుకుని కూర్చున్నప్పుడే - ప్రాణాలు వదిలింది.

పట్టుతప్పిన నెలల పిల్ల ఏడుపు ఎక్కువ చేసింది.

ఎవరికీ గమనం లేకుండానే, ఎవరి దృష్టినీ ఆకట్టుకోకుండానే.. అమ్మ కోరిక కాలగర్భంలో కలిసిపోయింది.

నిద్రలేచిన తరువాత వసుంధరకు యింతసేపూ తను ఎక్కడకు వెళ్లిందో తెలియలేదు.

ఏం చూసిందో అసలు గమనం లేదు.

*నవ్య-ఆగస్ట్, 2006*

◆